రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరలు టమోటా రూ.67, వంకాయ రూ.28, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.60, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.23, క్యాలిఫ్లవర్ రూ.35, క్యాబేజీ రూ.35, క్యారెట్ రూ.35, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.19, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.16, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.85, అర్వి రూ.35, మునగ రూ.80, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.23, కీర రూ.21, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.65.
ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

తొలి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



హరిహరక్షేత్రంలోని వేంటేశ్వరస్వామి

దిల్‌సుఖ్‌నగర్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌గనగర్, సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, అక్బర్‌బాగ్, మాదన్నపేట, సరూర్‌నగర్ ప్రాంతాలలోని వైష్ణవ ఆలయాలతో పాటు శివాలయాలను ముస్తాబు చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆక్సిజన్‌తో ఆరోగ్యం!



కాంక్రీట్ జంగల్‌గా మారిన నగరంలో కాస్త సేద తీరాలన్నా పచ్చదనం కరువైంది. పనులు, వివిధ సమస్యలతో ఒత్తిడితో సతమతమవుతూ బిజీబిజీ జీవితం గడిపే వారు, చిన్నారులు, కిట్టిపార్టీ చేసుకునే వారికి వనస్థలిపురంలోని రాజీవ్‌గాంధీ పార్కు ఆహ్లాదం కల్పిస్తోంది. సాయంత్ర వేళలో సందర్శకులు, చిన్నారులు, మొక్కల ప్రేమికులతో కిటకిటలాడుతోంది. రొక్క ఔషధ గుణాల మొక్కలతో ఉన్న ఈ పార్కును చూడాల్సిందే మరీ. – ఎల్‌బీనగర్

బీఎన్‌రెడ్డినగర్ ఎన్జీవోస్‌కాలనీలోని రాజీవ్ గాంధీ ఆక్సిజన్ పార్కు సుమారుగా నాలుగు ఎకరాల విస్తరించి ఉంది. ఉదయం వాకర్స్‌లతో సాయంత్రం సందర్శకులతో కిటకిటలాడుతోంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ పార్కును వనస్థలిపురం వాసులకు అనుగుణంగా పచ్చదనం, తీరొక్క ఔషధగుణాలతో తీర్చిదిద్దారు. ఇక సాయంత్రం వేళలో చిన్నారులతో పాటు పార్కును సందర్శకులతో కోలాహలంగా మారుతోంది. ఈ పార్కులో సుమారుగా 100కు పైగా ఔషధ గుణాల మొక్కలను పెంచుతున్నారు. దీంతో ఇక్కడి వాసులకు ఆక్సిజన్ పార్కుగా ప్రసిద్ధి గాంచింది. ఇందులో ఎర్రాస్పర్, పాండ, పైజనల్వా, పుత్రాంజ, అలుబొండ, నుల్లి, తెల్లగంజి, దేవరగన్నె, తెల్లపాలమట్ట, వెదురు, భవన, రెక్సోజన, నందివర్ధన ఇలా 100కు పైగా మొక్కలతో ఈ పార్కును ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా ఆక్సిజన్ పార్కుగా పేరు గాంచింది.

- వనస్థలిపురం ఆక్సిజన్ పార్కుకు సందర్శకుల తాకిడి
- 100కుపైగా ఔషధ గుణాల మొక్కలు
- సందర్శకులతో నిత్యం కిటకిట

రోజు 500 మంది సందర్శన..

ఈ పార్కులో అద్భుతంగా తీర్చిదిద్దిన దోలంతకాటంగ్ డిజైన్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా కిట్టీ, బర్త్‌డే పార్టీలకు ఇది వేదికగా మారుతోంది. ఫొటో షూట్ ఇక్కడే తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారని సిబ్బంది పేర్కొంటున్నారు.ఈ పార్కును చూసేందుకు చాలా మంది సందర్శకులు వస్తుంటారు. ప్రతి రోజు సుమారు 500 మందికిపైగా వస్తుంటారు. ఇక సెలవు దినాల్లో వివిధ ప్రాంతాల నుంచి 1000కి పైగా సందర్శకులు వస్తుంటారన్నారు.



పార్కులో దోలంతో డిజైన్

సందర్శన వేళలు..

ఉదయం 5 నుంచి 9 గంటల వరకు..
సాయంత్రం 3 నుంచి 9 గంటల వరకు..
టికెట్ ధర: పెద్దలు, చిన్నారులకు రూ.5
కెమెరాలతో రూ.300

పచ్చదనానికి ప్రాధాన్యం..

ఈ పార్కులో సందర్శకులను ఆకట్టుకునేందుకు పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి మొక్కలో ఏదో ఒక ఔషధ గుణాలు ఉన్నవే. అందుకే ఈ పార్కుకు వచ్చే వారికి పూర్తిస్థాయిలో ఆక్సిజన్ ఇచ్చేలా తీర్చిదిద్దాం.
– ఆనంద్‌కుమార్, పార్కు కేర్‌టేకర్

అద్భుతంగా ఉంది..



పార్కు అద్భుతంగా ఉంది. మేఘాలయలో ఇలాంటి పార్కులు లేవు. పచ్చదనంతో సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. రోజు మొత్తం పని ఒత్తిడితో విసిగిపోయిన వారు సాయంత్రం ఒక గంట పాటు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటే ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.
– రిషోక, విద్యార్థి మేఘాలయ

ఔషధ మొక్కలతో ఎంతో మేలు..



ఔషధ మొక్కలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.ఔషధ మొక్కలపై అవగహన కల్పించి ఇళ్లలో కూడా పెంచుకునే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. మేఘాలయ నుంచి వచ్చి నగరంలో చదువుకుంటున్న తమకు పార్కు గురించి తెలిసి వచ్చి ఫొటో షూట్‌కు వచ్చాం.
– సిరతాయి, విద్యార్థి, మేఘాలయ

బోనాల చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

లింగోజీగూడ: ఆషాఢ బోనాల సందర్భంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అమ్మవారి దేవాలయాల వద్ద ఏర్పాట్ల కోసం ప్రతి ఏడాది అందిస్తున్న చెక్కులను మంగళవారం ఎల్‌బీనగర్ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లేల చిన్నారెడ్డి, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడారు. బోనాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని 178 అమ్మవారి దేవాలయాలకు చెక్కులు అందించినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల నరసింహరెడ్డి, కార్పొరేటర్లు క్లోం నవజీవన్‌రెడ్డి, చింతల అరుణ, సుజాతనాయక్, నాయికోటి పవన్‌కుమార్, మొద్దు లచ్చిరెడ్డి, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్నగౌడ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గం ఎన్నికలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురంలో నూతనంగా లయన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మనోహర్ రెడ్డి, డిస్టిక్ ఫస్ట్ వైస్ గవర్నర్ గంపా నాగేశ్వర్‌రావు, కమలాకర్, శ్యామల ఆధ్వర్యంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూరయ్య, ప్రధాన కార్యదర్శిగా నందకిశోర్, కోశాధికారిగా మల్లికార్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూలై 21న ప్రమాణ స్వీకారం ఉంటుందని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్..

వనస్థలిపురం ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శీలం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాయివర్మ, కోశాధికారిగా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, బాలకిషన్, సంయుక్త కార్యదర్శిగా రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మలక్‌పేట: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంద నవీన్ ఆధ్వర్యంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన ర్యాలీకి నాగరాజు హాజరై మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పాలకులు విద్యార్థి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి 7 నెలలు అవుతున్నా విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త

చైతన్యపురి: డివిజన్‌లోని కాలనీలలో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. మంగళవారం ఆయన కాలనీలో పర్యటిస్తూ శానిటేషన్ పనులను పరిశీలించి మాట్లాడారు. రహదారులపై ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో ప్రజలు అంటు వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసి సిబ్బంది జవాన్, గణేష్‌రెడ్డి, నరేష్, స్థానికులు కమల్ సత్యం పాల్గొన్నారు.

గృహ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలి



కార్యక్రమంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న గృహ కార్మికులు

వనస్థలిపురం: గృహ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని తెలంగాణ గృహ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం యూనియన్ రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ మాధురి ఆధ్వర్యంలో వనస్థలిపురంలో నిర్వహించిన అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గృహ కార్మికులు బతుకుదెరువు కోసం ఇళ్లల్లో పనిచేస్తూ కుటుంబ భారాన్ని మోస్తూ దుర్భర జీవనం సాగిస్తున్నారన్నారు. తెలంగాణలో ఉన్న 11 లక్షల మంది గృహ కార్మికుల హక్కుల సాధనకు యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. తమ హక్కుల సాధనకు త్రిసభ్య కమిటీ వేసి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. గృహ కార్మికులకు వారానికి ఒకరోజు సెలవు, ఈఎఫ్, పీఎఫ్, కనీస వేతనం రూ. 12 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లేబర్ లైన్ కోఆర్డినేటర్ స్వర్ణ, ఎంఎస్‌ఐ డైరెక్టర్ బ్రదర్ వర్గీస్, రాష్ట్ర కోఆర్డినేటర్లు శోభ, లూర్ద్‌మేరీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, కమిషనర్ దృష్టికి అక్రమ పార్కింగ్ వ్యవహారం

చంచల్‌గూడ: పాతబస్తీ మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో అకస్మాత్తుగా ప్రారంభమైన అక్రమ పార్కింగ్ నిర్వహణను అరికట్టాలని మాదన్నపేట ఆకుకూరల వ్యాపారుల సంఘం సభ్యులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆశ్రయించారు. తెలంగాణ హై కోర్టు రద్దు చేసిన శ్రీ దయానంద్ వెజిటేబుల్ మార్కెట్ సొసైటీ అనుబంధంగా శ్రీ వేంకటేశ్వర్ సైకిల్ స్టాండ్ పేరుతో ఓ వ్యక్తి అక్రమంగా నిర్వహిస్తున్న పార్కింగ్ దందాను తక్షణమే అడ్డుకోవాలని వ్యాపారుల సంఘం ప్రతినిధులు జి. రమేష్, సుమన్ కలెక్టర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కొందరు కుట్రపూరితంగా ఏర్పాటు చేసిన శ్రీ దయానంద్ వెజిటేబుల్ మార్కెట్ సొసైటీని హైకోర్టు రద్దు చేసినప్పటికీ ఈ విషయం రహస్యంగా ఉంచి అటు మాదన్నపేట పోలీసులు, జీహెచ్‌ఎంసీ శాఖలను మోసం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా పార్కింగ్ నిర్వహిస్తున్న వారికి మండీతో ఎలాంటి సంబంధం లేదని ఆనంద్ సోప్ ఇండస్ట్రీయల్ కోఆపరేటివ్ సొసైటీ గానీ సంస్థ అనుబంధ దయానంద్ వెజిటేబుల్ మార్కెట్ కమిటీ గానీ పార్కింగ్ నిర్వహణకు అనుమతులుగా లీజు అగ్రిమెంట్ గానీ చేయలేదని తెలిపారు. తాము 22 సంవత్సరాలుగా దయానంద్ వెజిటేబుల్ మార్కెట్‌కు మాత్రమే అద్దెలు చెల్లిస్తున్నామని, హైకోర్టు రద్దు చేసిన శ్రీ దయానంద్ వెజిటేబుల్ మార్కెట్ సొసైటీ ఇంకా లావాదేవీలు కొనసాగడం కిరాయి రసీదులు ఇవ్వడం జరుగుతుందన్నారు. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని చార్మినార్ జోనల్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ వెంకన్న తెలిపారన్నారు.

కాంగ్రెస్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు పతనం



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్య విలువలు పతనమైపోతున్నాయని బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ఆరోపించారు. మంగళవారం గ్రీన్‌హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదుసార్లు ఎమ్మెల్యే, మూడు సార్లు మంత్రిగా సేవలందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కాంగ్రెస్ నాయకులు అవమానించారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటమి పాలైన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని ప్రోటోకాల్ లేకున్నా ప్రభుత్వ కార్యక్రమంలో స్టేజీపైకి పిలిచి చెక్కులు పంపిణీ చేయడం సిగ్గు చేటన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో ప్రజాప్రతినిధులకు సరైన గౌరవం, గుర్తింపు ఉండేదన్నారు. పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పరిపాలనలో ఎక్కడ కూడా ప్రొటోకాల్ సమస్యలు తలెత్తలేదన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తయారు చేయాలనే సంకల్పంతో వేలాది ఐటీ కంపెనీల తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సబితా ఇంద్రారెడ్డిని అవమానపరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. లక్ష్మీనర్సింహారెడ్డి, అర్జున్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌కుమార్, శ్రీనివాస్, పెంబర్తి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, వెంకటేష్, బడంగ్‌పేట కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి పాల్గొన్నారు.

పనుల పరిశీలన


ఎల్‌బీనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని ఆంధ్రకేసరినగర్ కాలనీలో జరుగుతున్న రోడ్ల పనులను ఆయన పరిశీలించారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ నూతన ట్రస్ట్ సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు నూతన ట్రస్ట్ సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా నాగరాజు, శాంతి, మర్రి శశికళ, తోట బసవ శంకరరావు, ఉమ్మడి జయశంకర్ రెడ్డి, బొమ్మరెడ్డి సుజాత, గుండ జయమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన సభ్యులు బానగిరి నాగరాజును చైర్మెన్‌గా ఎన్నుకున్నారు.

నిధుల మంజూరుకు వినతి



చైతన్యపురి: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి జలమండలి డివిజనల్ జనరల్ మేనేజర్ బలరామరాజుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. డివిజన్‌లోని అనేక ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ధ్వంసమయ్యాయని మంచి నీటి పైపులలో కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో పరిశీలించి డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలన్నారు.

మైనర్‌తో షో రూమ్‌లో పని చేయిస్తున్న మేనేజర్‌పై కేసు

నాగోలు: టీవీఎస్ షో రూమ్‌లో ఓ మైనర్ బాలుడిని తో పని చేయిస్తున్న మేనేజర్‌పై కేసు నమోదైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్ సూర్యోదయ నగర్ కాలనీ ప్రధాన రోడ్డు మీద ఉన్న టీవీఎస్ షో రూమ్‌లో ఓ మైనర్ బాలుడు పని చేస్తున్నాడని సమాచారంతో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా సామాజిక కార్యకర్తలు, చైల్డ్ లైన్ అధికారులు ఎల్‌బీనగర్ పోలీస్‌లకు సమాచారం అందించారు. మంగళవారం షోరూమ్‌కి వెళ్లిన పోలీసులు అక్కడ మైనర్ బాలుడు (15) పని చేస్తున్నట్లు గుర్తించి మేనేజర్‌పై కేసు నమోదు చేశారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న విద్యార్థి నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఇన్వెస్టిచర్ సెర్మనీలో ఓజోన్ ఆసుపత్రి ఎండీ ఇంద్రసేనారెడ్డి హాజరై విద్యార్థి నాయకులుగా ఎన్నికైన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించి, వారికి బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, డీన్ కుందన వెల్లి, డీఐ దయాకర్ పాల్గొన్నారు.

- విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం యాదవ్ అన్నారు. మంగళవారం వనస్థలిపురంలోని రవీంద్రభారతి పాఠశాలలో జరిగిన ఇన్వెస్టిచర్ సెర్మనీకి ఆయన ముఖ్య అతిగా హాజరై విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. కార్యక్రమంలో డీన్ కుందన వల్లి, డీఐ దయాకర్, ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో..

మలక్‌పేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మలక్‌పేట ట్రాఫిక్ ఎస్సై యాదయ్య అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'ఇన్వెస్టిచర్ సెర్మనీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యక్తి, వ్యవస్థను శక్తిగా మార్చేది నాయకత్వమే లక్షణమే అన్నారు. పాఠశాలలో కార్య నిర్వాహక కమిటీ ఏర్పాటు చేశారు. కెప్టెన్, వైస్ కెప్టెన్‌లను నియమించి వారికి బ్యాడ్జీలు అందజేసి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమ, డీఐ దయాకర్, ఏడీఐ నిషాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఇస్తే ఓ రేటు.. లేదంటే మరోరేటు!

ట్రేడ్ లైసెన్స్ పేరుతో మాముళ్ల వసూళ్లు?

మలక్‌పేట: వ్యాపారులకు అవగాహన కల్పించి 24 గంటల్లో ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేయాల్సిన అధికారులు, సిబ్బంది మాముళ్లకు అలవాటు పడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. లైసెన్స్ ఇస్తే ఓ రేటు.. లేకుంటే మరో రేటు కట్టి జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 పరిధిలోని మూసారంబాగ్ డివిజన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తీరుతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దిల్‌సుఖ్‌నగర్ వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో వ్యాపారులకు నోటీసులు ఇస్తూ బెదిరింపులకు దిగుతూ మాముళ్లు వసూలు చేస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నా వారి దగ్గర కూడా వేలల్లో దండుకుంటున్నారు. ట్రేడ్ లైసెన్స్ కావాలంటే రూ.20 వేలు నుంచి రూ. 15 వేలు అడిగారని, లైసెన్స్ వద్దనుకుంటే రూ.12 నుంచి రూ. 8 వేల వరకు ఇవ్వాలని సంబంధిత అధికారి తన సిబ్బందిని ఆఫీసుకు పంపించాడని ఓ స్టడీ హాల్ నిర్వాహకుడు తెలిపాడు. వేధింపుల తట్టుకోలేక దీనిపై ఏసీబీ అధికారులను ఆశ్రయించిన ఫలితం లేకుండా పోయిందని, తక్కువ మొత్తం ఉన్న కారణంగా ఏమీ చేయలేమని ఏసీబీ అధికారులు చెప్పారని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్స్ గడువు ఉన్న రూ.5 వేలు తీసుకున్నారని ఓ హస్టల్ నిర్వాహకురాలు ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 10 వేలు డిమాండ్ చేశారని మరో హాస్టల్ నిర్వాహకుడు తెలిపాడు.

సౌదీ కరెన్సీ అన్నారు.. కాగితపు కట్టాలు ఇచ్చారు!

వేర్వేరు ఘటనలో ఇద్దరి నుంచి రూ. 5.80 లక్షలతో పరార్

నాగోలు: తన దగ్గర సౌదీ రియాల్స్ ఉన్నాయని తనకు ఇండియన్ కరెన్సీ కావాలని మోసం చేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మౌలాలి, షాదుల్లానగర్‌కు చెందిన మహమ్మద్ దస్తగిరి చర్లపల్లిలో వెల్డింగ్ షాపులో పనిచేస్తుంటాడు. ఈ నెల 12న గుర్తు తెలియని వ్యక్తి వెల్డింగ్ షాప్ వద్దకు వచ్చి తన వద్ద సౌదీ రియాల్స్ ఉందని తక్కువకు ఇస్తాను తనకు ఇండియా కరెన్సీని కావాలని చెప్పి ఒక నోటు దస్తగిరికి ఇచ్చాడు. అతను చార్మినార్ వద్దకెళ్లి నోటు గురించి ఆరా తీస్తే అసలైందేనని తెలిసింది. గుర్తు తెలియని వ్యక్తి వద్ద రూ. 2.80 లక్షల సౌదీ కరెన్సీ ఉందని ఇక్కడ మార్చుకుంటే పెద్ద ఎత్తున్న డబ్బులు వస్తాయని నమ్మించాడు. అందుకు ఇండియన్ కరెన్సీ కావాలని చెప్పాడు. నిజమని నమ్మిన దస్తగిరి సోమవారం ఎల్‌బీనగర్ సిరిస్ రోడ్‌లోని జీవీకే హాస్పిటల్ లైన్‌కి డబ్బులు తీసుకుని వచ్చాడు. దస్తగిరి తన వద్ద ఉన్న రూ. 2.80 లక్షలను గుర్తు తెలియని వ్యక్తికి ఇవ్వగా అతడు ఓ బ్యాగును ఇచ్చాడు. ఆ వ్యక్తి వెళ్లిన కాసేపటి తర్వాత బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో పేపర్ బండిల్స్ ఉండటంతో మోసపోయినట్లు గ్రహించి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. తనకు అబ్దుల్ హాజీజ్ అనే వ్యక్తి గుర్తు తెలియని వ్యక్తిని పరిచయం చేశారని దస్తగిరి పోలీసులకు తెలిపాడు.

మరో ఘటనలో రూ.3 లక్షలు

ఘట్‌కేసర్ మండలం నారపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ బిల్డింగ్ లిఫ్ట్ పని చేస్తుంటాడు. ఈ నెల 10న అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ సక్లైన్ ఫోన్ చేసి ఇర్ఫాన్‌ను నారపల్లిలోని బావర్చి హోటల్‌కి రావాలని చెప్పాడు. అక్కడ ఓ గుర్తు తెలియని వ్యక్తిని పరిచయం చేశాడు. అతడు తన వద్ద సౌదీ నోటు చూపించి తన కు ఇండియన్ కరెన్సీ కావాలని అడిగాడు. తన వద్ద 1675 నోట్లు ఉన్నాయని ఇండియన్ కరెన్సీనితో మార్చిస్తే కమీషన్ అందుతుందని ఇర్ఫాన్ నమ్మించాడు. 14న ఇర్ఫాన్ అతని సోదరుడు మన్నన్, రియజ్, సక్లైన్‌తో కలిసి వచ్చి రూ. 3 లక్షల తీసుకుని భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోకి సదరు వ్యక్తికి ఇవ్వగా వారికి ఓ బ్యాగ్ ఇచ్చి అక్కడి నుండి వెళ్లిపోయాడు. బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో కాగితాల బండిల్స్ ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.